www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 5 ఫిబ్రవరి 2024

నేడు చింతలపూడిలో చంద్రబాబు సభ



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

2024 ఎన్నికల ప్రచారంలో భాగంగా టిడిపి అధ్యక్షుడు, మాజీ సిఎం నారా చంద్రబాబు నాయుడు చేపట్టిన రా కదలిరా.. బహిరంగ సభ సోమవారం చింతలపూడి మండలం ఆంథోని నగర్‌లో జరగనుంది. చంద్రబాబు ఉదయం అనకాపల్లి జిల్లాలో రా కదలి రా సభలో పాల్గొని సాయంత్రం మూడు గంటలకు హెలీకాప్టర్‌లో చింతలపూడి చేరుకుంటారు. దాదాపు గంటన్నర 4.30 గంటల వరకూ బహిరంగ సభలో మాట్లాడతారు. తిరిగి హెలీకాప్టర్‌లో 5.15 గంటలకు ఉండవల్లిలోని నివాసానికి చేరుకుంటారు. చంద్రబాబు పర్యటన నేపథ్యంలో టిడిపి నాయకులు పెద్దఎత్తున ఏర్పాట్లు చేశారు. జనం పెద్ద సంఖ్యలో పాల్గొనున్నట్లు తెలిపారు.

'గుడ్డు' గూడుపుఠాణి..!

స్కూళ్లలోని 'జగనన్న గోరుముద్ద'లో గుడ్డు దోపిడీ
విద్యార్థులు రాకపోయినా గుడ్లు తీసుకోవాల్సిందేనని హుకుం
కాంట్రాక్టర్లకు కొమ్ముకాస్తూ ప్రత్యేక ఆదేశాలు
మిగిలిన గుడ్లు చెడిపోయినట్లు రాసుకోవాలని సమాధానం
రూ.కోట్ల ప్రజాధనం కాంట్రాక్టర్‌కు కట్టబెట్టేందుకు వ్యూహం
గడువు ముగిసిన 'చిక్కీ'లు అంటగడుతున్నా పట్టని అధికారులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

విద్యార్థులకు అందించే కోడి గుడ్డులోనూ పెద్దఎత్తున దోపిడీకి అధికారికంగానే గ్రీన్ సిగ్నల్ ఇచ్చేశారు. కాంట్రాక్టర్లకు కొమ్ముకాస్తూ గతంలో కొనసాగిన నిబంధనలకు విరుద్ధమైన ఆదేశాలను ప్రభుత్వం జారీచేసిన పరిస్థితి నెలకొంది. స్కూళ్లకు హాజరయ్యే విద్యార్థుల సంఖ్య బట్టి కాకుండా ఎన్‌రోల్‌మెంట్ ఆధారంగా కోడిగుడ్లు తీసుకోవాలంటూ హుకుం జారీచేసిన పరిస్థితి నెలకొంది. మిగిలిపోయిన వందల సంఖ్యలో కోడిగుడ్లను చెడిపోయినవిగా లెక్కలు చూపించాలంటూ ఇస్తున్న సమాధానంతో స్కూల్ ప్రధానోపాధ్యాయులకు ఏంచేయాలో తెలియని పరిస్థితి. 'జగనన్న గోరుముద్ద' కింద గుడ్డు సరఫరాలో ఇప్పటివరకూ సాగిన నిబంధనలు ఏంటి? కొత్తగా జారీచేసిన ఆదేశాలు ఏంటో ఒక్కసారి పరిశీలిస్తే దోపిడీ గుట్టు ఇట్టే అర్థం చేసుకోవచ్చు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 3.231 స్కూళ్లలో 'జగనన్న గోరుముద్ద' (మధ్యాహ్న భోజనం) కొనసాగుతోంది. మూడు లక్షల మందికిపైగా విద్యార్థులు లబ్ధిపొందుతున్నట్లు లెక్కలు చెబుతున్నాయి. ఈ పథకం కింద తినే మధ్యాహ్న భోజనంలో వారానికి ఐదు రోజులు కోడిగుడ్డు వేస్తారు. ఐదు రోజులకు సరిపడా ఒకేసారి కోడిగుడ్లను కాంట్రాక్టర్ స్కూళ్లకు అప్పగిస్తారు. ఒక హైస్కూల్లో మొత్తం 300 మంది విద్యార్థులుంటే ప్రతిరోజూ సరాసరి హాజరయ్యే విద్యార్థులు 260 మంది వరకూ ఉంటారు. దీన్నిబట్టి ప్రధానోపాధ్యాయులు గుడ్లు

తీసుకుంటారు. చాలా కాలంగా ఇదేవిధానం కొనసాగుతోంది. స్కూళ్లలో కూడా ఎటువంటి ఇబ్బంది లేకుండా సాగుతోంది. ఇప్పుడు ఒక్కసారిగా కాంట్రాక్టర్లకు లబ్ధిచేకూర్చే విధంగా కొత్త ఆదేశాలు తెరపైకి తెచ్చారు. స్కూళ్లలో ఉన్న ఎన్‌రోల్‌మెంట్ (చేరిన విద్యార్థులు) సంఖ్య ఆధారంగా కోడిగుడ్లు తీసుకోవాలంటూ హుకుం జారీచేశారు. ఆన్‌లైన్ చూపిస్తున్న విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఇండెంట్ తీసుకోవాలంటూ ఆదేశాలు తీసుకొచ్చారు. ఈ ప్రకారం తీసుకుంటే తక్కువగా లెక్కించిన 300 మందికిపైగా విద్యార్థులున్న స్కూళ్లలో వారానికి 200 నుంచి 300 గుడ్లు మిగిలిపోయే పరిస్థితి ఏర్పడనుంది. మిగిలిపోయిన గుడ్లను ఏంచేయాలని అడిగితే మాత్రం చెడిపోయినట్లుగా (డ్యామేజ్) రాయాలంటూ సమాధానం ఇస్తున్నారని తెలుస్తోంది. ఉమ్మడి జిల్లాలో 3,231 స్కూళ్లు ఉండగా మిగిలిపోయే గుడ్లు సరాసరి లెక్కించినా దాదాపు వారానికి 40 వేలకు పైగా ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. గుడ్డు రూ.ఐదు చొప్పున లెక్కించినా వారానికి రూ.20 లక్షలపైగా, నెలకు రూ.కోటికి పైగా ప్రజాధనం ఈ జిల్లాలోనే కాంట్రాక్టర్లకు దోచిపెట్టే పనికి పూనుకున్న పరిస్థితి నెలకొంది. ఈ లెక్కలు ప్రాథమికంగా వేసినవి మాత్రమే. పూర్తిస్థాయిలో లెక్కలు తీస్తే దోపిడీపర్వం భారీగా ఉంటుందన్న చర్చ నడుస్తోంది. ఇక రాష్ట్ర వ్యాప్తంగా దోపిడీ ఎంత ఉంటుందో వేరే చెప్పనక్కర్లేదు. మిగిలిన గుడ్లను తర్వాత వారం వాడుకునేందుకు వీలులేదని ఆదేశాలిచ్చారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో లక్షల సంఖ్యలో గుడ్లు వృథాగా పక్కకు పడేయాల్సి వస్తుంది. కాంట్రాక్టర్‌కు మేలు చేయడానికి ప్రజల సొమ్మును వృథా చేసేందుకు ప్రభుత్వం పూనుకోవడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రతిరోజూ స్కూల్‌కు హాజరయ్యే విద్యార్థులను బట్టి కాకుండా ఎన్‌రోల్‌మెంట్ ఆధారంగా కోడిగుడ్లు తీసుకుని వృథాగా పడేయాలని చెప్పడం ఎంతవరకూ సమంజసమో ప్రభుత్వం చెప్పాల్సి ఉంది. ఈ విధానాన్ని అమలు చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారులకు ఆదేశాలు రావడం, ఎంఇఒలు ప్రధానోపాధ్యాయులకు ఆదేశాలివ్వడం జిల్లాలో జరిగిపోయింది.



Good evening to all AD s,

very important alert regarding Egg and chikki supply

I am sharing the indent placed by our HM 's and DEO must take due care and ensure HM 's must not go against the placed indent .

1.HM shall not ask more than the indent ,if taken more we are not concerned about the extra and it's payment,HM will be held responsible.

2.HM must not see balance of previous phase eggs and should not deny taking from supplier when supplied as per indent in next phase.

INDENT MUST BE STRICTLY COMPLIED

When HM is doing any of the above mentioned conditions supplier will alert us and immediately DEO will be given information and HM should be given show cause calling explanation.

DEO should take up the responsibility of educating all HM s on this.

Regards,

రోల్‌ను బట్టి గుడ్లు తీసుకోవాలంటూ విద్యాశాఖ అధికారులకు జారీచేసిన ఆదేశాలు

గడువు ముగిసిన చిక్కీలిచ్చినా అడిగే నాథుడే కరువు..

గడువు ముగిసిన చిక్కీలు స్కూళ్లకు సరఫరా చేస్తున్నా అడిగే నాథుడే లేకుండా పోయాడు. నిబంధనల ప్రకారం చిక్కీలు నెలకు రెండు సార్లు స్కూళ్లకు సరఫరా చేయాలి. అలాకాకుండా నెలకు ఒకేసారి చిక్కీలను కాంట్రాక్టర్ సరఫరా చేసేస్తున్నారు. ప్రస్తుత పరిస్థితి పరిశీలిస్తే అసలు విషయం అర్థమవుతోంది. ప్రస్తుతం స్కూళ్లకు అందించిన చిక్కీలు డిసెంబర్ 25న తయారయ్యాయి. వీటికి గడువు తేదీ ఫిబ్రవరి 22వ తేదీ వరకూ ఉంది. అయితే మార్చి మొదటివారానికి సరిపడా చిక్కీలను స్కూళ్లకు సరఫరా చేసేశారు. గడువు దాటిన చిక్కీలనే విద్యార్థులకు పెట్టాల్సిన పరిస్థితి ప్రధానోపాధ్యాయులకు ఏర్పడుతోంది. అదేంటని అడిగితే సరైన సమాధానం లేదు. దీనిపై విద్యాశాఖ అధికారులు నోరుమెదపడం లేదు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రభావం చూపే పరిస్థితి ఉన్నా పట్టించుకోకపోవడం ఏ ఒక్కరికీ అర్థంకాని పరిస్థితి. దీనిపై ఇప్పటికైనా జిల్లా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని అంతా కోరుతున్నారు.

సభలో మాట్లాడుతున్న అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు బేబీరాణి

భవిష్యత్ ఉద్యమాలకు మార్గదర్శం..
అంగన్వాడీల పోరాటం

అంగన్వాడీల అభినందన సభలో వక్తలు
ఈ విజయం చారిత్రాత్మకం : అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు జి.బేబీరాణి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

అంగన్వాడీల పోరాటం చూసి రాజకీయ పార్టీల్లో వణుకు పుట్టిందని, ఈ పోరాటం భవిష్యత్ పోరాటాలకు మార్గదర్శకంగా నిలుస్తుందని పలువురు వక్తలు అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్‌ను అభినందించారు. ఆదివారం స్థానిక త్యాగరాజు భవనంలో జరిగిన అంగన్వాడీల అభినందన సభకు అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఝాన్సీ లక్ష్మి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.కళ్యాణి 42 రోజుల సమ్మె విషయాలను వివరించారు. సభకు ముఖ్యవక్తగా హాజరైన సిఐటియు అఖిల భారత ఉపాధ్యక్షురాలు, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు జి.బేబీరాణి మాట్లాడుతూ అంగన్వాడీల ఉద్యమం దేశ చరిత్రలోనే ప్రజా ఉద్యమాలకు మూలమలుపు కానుందన్నారు. తాళాలు పగలుగొట్టినా, ఎస్మా ప్రయోగించినా అదరకుండా బెదరకుండా పోరు సాగించి ప్రభుత్వాన్ని ఒప్పించి సమస్యలు పరిష్కరించుకున్న అంగన్వాడీల విజయం చారిత్రాత్మకమన్నారు. ప్రభుత్వం అంగన్వాడీల పట్ల చిన్నచూపుతో వ్యవహరించి బెదిరించి నిర్బంధాలకు గురిచేసిన అన్ని సందర్భాల్లోనూ అబాసుపాలైందన్నారు. నిరవధిక నిరాహార దీక్షలు చేపట్టిన అంగన్వాడీలను రాత్రి రెండు గంటల సమయంలో లైట్లు ఆపేసి అరెస్టులు చేసి భయభ్రాంతులకు గురిచేసినా మడం తిప్పకుండా ప్రభుత్వం సమస్యలు పరిష్కరించే వరకూ విజయవాడ వదిలి వెళ్లేది లేదని చేసిన పోరాటం ప్రభుత్వానికి చెమటలు పట్టించిందని తెలిపారు. ఎస్మా వంటి బలమైన చట్టాలను ప్రయోగించినా సమ్మెను కొనసాగించిన ఘనత రాష్ట్ర అంగన్వాడీలకే దక్కుతుందన్నారు. సమ్మెలకు ఫుల్‌స్టాప్ ఉండదని, ముగింపు ఉండదని తాత్కాలికంగా వాయిదా మాత్రమే వేశామని ఇచ్చిన వాగ్దానాలు నెరవేరకపోతే మళ్లీ సమ్మె ప్రారంభమవుతుందని అన్నారు. సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జెఎన్‌వి.గోపాలన్, కె.రాజా రామ్మోహన్ రాయ్ మాట్లాడుతూ అంగన్వాడీల పోరాటం అనేక సంఘాలకు ఆదర్శంగా నిలుస్తుందన్నారు. సమ్మె సమయంలో అంగన్వాడీలు ఉదయం తొమ్మిది గంటలకు వచ్చి సాయంత్రం నాలుగు గంటల వరకూ ఉండి వినూత్న నిరసనలు తెలిపారన్నారు. ధర్నాలు నిరసన సమయంలో పోలీసులు అరెస్ట్ చేసినప్పటికీ స్టేషన్లోనే పోరాటం సాగించారన్నారు. మున్సిపల్ కార్మికులు, సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు సమ్మె చేసి విజయం సాధించారన్నారు. ఎక్కడ పోరాటాలకు ఉద్యోగ కార్మికులు ముందుకొస్తారో అక్కడ సిఐటియు ఉంటుందని తెలియజేశారు. సభలో విఒఎల సంఘం జిల్లా అధ్యక్షులు నిర్మల, మిడ్ డే మీల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు మదీనా బేబీ, ఐద్వా జిల్లా అధ్యక్షులు కె.పద్మ, వ్యవసాయ కార్మిక సంఘం, రైతు, కౌలు రైతు సంఘాల నాయకులు జక్కంశెట్టి సత్యనారాయణ, జుత్తిగ నరసింహమూర్తి, మామిడిశెట్టి రామాంజనేయులు, కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతిబాబు, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ధనుష్ తదితరులు మాట్లాడారు. అంగన్వాడీల పోరాటం స్ఫూర్తిదాయకమన్నారు. ముందుగా ఎంఎల్‌సి సాబ్జీ చిత్రపటానికి బేబిరాణి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే అంగన్‌వాడీల సమ్మెలో భాగంగా ప్రాణాలు కోల్పోయిన అంగన్‌వాడీలకు సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ జిల్లా నాయకులు ఉషారాణి, తులసి, దీన స్వరూప, మార్తమ్మ, శ్రీదేవి, పెద్దింట్లు సిఐటియు జిల్లా నాయకులు బి.వాసుదేవరావు, ఎస్.రంగారావు, కె.నాగేశ్వరరావు, తెలగంశెట్టి సత్యనారాయణ, ఎం.త్రిమూర్తులు, ఎం.ఆంజనేయులు, విజయ్‌కుమార్ ఇ.శ్రీనివాస్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాజా రామ్మోహన్ రాయ్

ఆలయాల అభివృద్ధి కనిపించదా..!

బురదజల్లడం తగదు : దేవాదాయ ధర్మాదాయ శాఖా మంత్రి కొట్టు సత్యనారాయణ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

రాష్ట్రంలో కొన్ని వందల కోట్ల రూపాయలతో జరుగుతున్న ఆలయాల అభివృద్ధి కనిపించదా, ప్రధాన ఆలయాల ఆధ్వర్యంలో ఆరు నెలలుగా జరుగుతున్న ధర్మ ప్రచారం వినిపించదా అని ఉప ముఖ్యమంత్రి, దేవదాయ ధర్మదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. ఆలయాలపై రాసిన ఆ రాతలన్నీ పచ్చి అబద్ధాలేనని ఆయన ఖండించారు. తాడేపల్లిగూడెంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. వైసిపి ప్రభుత్వంలో సిఎం జగన్ నాయకత్వంలో పెద్ద ఎత్తున ఆలయాలు అభివృద్ధి జరుగుతుంటే చూసి తట్టుకోలేకపోతున్నారన్నారు. తెలుగుదేశం హయాంలో చంద్రబాబు విజయవాడ నడిబొడ్డున 40 దేవాలయాలు కూల్చివేసి విగ్రహాలను మున్సిపాలిటీ చెత్త ట్రాక్టర్‌లో తీసుకువెళ్లారన్నారు. వైసిపి అధికారంలోకొచ్చాక సిఎం జగన్ ఆదేశాలతో ఆ ఆలయాలను పున:నిర్మించి ప్రారంభించామని చెప్పారు. సింహాచలం దేవస్థానానికి సంబంధించి అంతకుముందు ట్రస్ట్ అవకతవకలకు పాల్పడినందున ప్రభుత్వం చర్యలు తీసుకుందని స్పష్టం చేశారు. సిఎం జగన్ ఆదేశాలతో అర్చక స్వాముల జీతాలను రూ.ఐదు వేల నుంచి రూ.పది వేలకు, రూ.పది వేల నుంచి రూ.15,625 పెంచినట్లు చెప్పారు. వంశపారంపర్య అర్చకత్వానికి అవకాశం కల్పించామన్నారు. రాష్ట్రంలో రూ.1400 కోట్ల పైగా వ్యయంతో ఆలయాల అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. రాష్ట్రంలో ప్రధానాలయాలను భవిష్యత్తులో పెరిగే భక్తుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు మాస్టర్ ప్లాన్ రూపొందించామన్నారు. దాని ప్రకారం విజయవాడ దుర్గమ్మ ఆలయాన్ని రూ.225 కోట్లతో అభివృద్ధి చేస్తున్నామన్నారు. రూ.215 కోట్ల నిధులతో శ్రీశైలం దేవస్థానం అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. శ్రీకాళహస్తి, అన్నవరం, కాణిపాకం, సింహాచలం, ద్వారకాతిరుమల ప్రధాన ఆలయాలను కొన్ని వందల కోట్ల రూపాయలు వెచ్చించి పెద్ద ఎత్తున వైసిపి ప్రభుత్వం అభివృద్ధి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ ముప్పిడి సంపత్ కుమార్, యూత్ లీడర్ కొట్టు విశాల్ పాల్గొన్నారు.

గోదావరి జిల్లాల్లో సిద్ధం సభ చారిత్రాత్మకం

సార్వత్రిక ఎన్నికలకు వైసిపి శ్రేణులను సన్నద్ధం చేస్తూ పార్టీ అధినేత, సిఎం జగన్ సమర శంఖారావం పూరించిన ఏలూరు సిద్ధం సభ ఉమ్మడి గోదావరి జిల్లాల్లో చారిత్రాత్మకమని, ఈ సభ గోదావరి జిల్లాల చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని డిప్యూటీ సిఎం కొట్టు సత్యనారాయణ పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. గోదావరి జిల్లాల చరిత్రలో ఎప్పుడూ ఇంత పెద్ద సభ జరగలేదన్నారు. సిద్ధం అంటూ జగన్ ఇచ్చిన పిలుపును అందుకుని పార్టీ కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు లక్షలాదిగా సభకు తరలి వచ్చారన్నారు. చంద్రబాబు అధికారాన్ని అడ్డం పెట్టుకుని విచ్చలవిడిగా దోచుకున్నాడని ఆరోపించారు. సిఎం జగన్ హామీలన్నీ అమలు చేసి ప్రజల గుండెల్లో స్థానం సంపాదించారన్నారు. సిద్ధం సభకు సునామీలా తరలివచ్చిన లక్షలాది మంది జనాన్ని చూశాక వైసిపి విజయం తథ్యమని తేటతెల్లమైందన్నారు.

సముద్ర కెరటాల్లో స్నానాలు చేస్తున్న పర్యాటకులు

బీచ్ వద్ద పర్యాటకుల సందడి

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని పేరుపాలెం బీచ్ వద్ద ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. బీచ్‌కు ప్రకృతి ప్రేమికులు, పర్యాటకులు ప్రత్యేక ద్విచక్ర వాహనాల్లో ఉదయమే తరలివచ్చారు. పలువురు సముద్ర కెరటాల్లో స్నానాలు చేశారు. చిన్నారులు ఇసుక తేన్నెలపై, ఒడ్డుకు కొట్టుకొస్తున్న కెరటాలతో ఆటలాడుకున్నారు. ఒడ్డున ఉన్న ఆలయాలను దర్శించుకుని సరివే, కొబ్బరి తోటల్లో సహపంక్తి భోజనాలు చేసి సేద తీరారు.

విద్యుత్ రాయితీ ఎత్తేయడం అన్యాయం

పోరుబాట పాదయాత్రలో ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి - యలమంచిలి

ఆక్వా రైతులకు గతంలో టిడిపి ప్రభుత్వం కల్పించిన విద్యుత్ రాయితీని వైసిపి ప్రభుత్వం ఎత్తివేయడం అన్యాయమని పాలకొల్లు ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు అన్నారు. రైతు సమస్యలపై ఆయన చేపట్టిన రైతు పోరు బాట యాత్ర ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లో కొనసాగింది. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో వైసిపి ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందన్నారు. గత ప్రభుత్వం అమలు చేసిన అనేక పథకాలను కూడా రద్దుచేసి రైతులకు, ఇటు ప్రజలకు కూడా అన్యాయం చేశారన్నారు. రానున్న ఎన్నికల్లో వైసిపికి ప్రజలు బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, మామిడి శెట్టి పెద్దిరాజు, బొప్పన హరికిషోర్, ఆర్.సత్యనారాయణరాజు, పాలపర్తి మాధవరావు, ముసుకూడి రాంబాబు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు

సెలవు దినాల్లోనూ రిజిస్ట్రేషన్లు

అధికారుల నిర్లక్ష్యంతో వెనుతిరుగుతున్న లబ్ధిదారులు

ప్రజాశక్తి - ఉండి

సెలవు దినాల్లోనూ సచివాలయ సిబ్బంది జగనన్న ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్లను రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్నారు. ఇప్పటికైనా ఇళ్ల స్థలాలు తమ చేతికి వస్తున్నాయని సొంతిల్లు నిర్మించుకుందామని ఆశపడ్డ లబ్ధిదారులకు అధికారుల నిర్లక్ష్యంతో చుక్కెదురైంది. ఉండి హైస్కూల్ లే అవుట్‌లో సర్వేయర్ల నిర్లక్ష్యం కారణంగా అక్కడి లబ్ధిదారులు రిజిస్ట్రేషన్లకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 2020 సంవత్సరం చివర్లో లబ్ధిదారులకు పట్టాలను అప్పటి తహశీల్దార్ ఆకుల కృష్ణజ్యోతి అందించారు. పట్టాలను అందించేటప్పుడు అందులో ఫ్లాట్ సరిహద్దులను నిర్ణయించి ఇచ్చారని, మూడేళ్ల తర్వాత హైస్కూల్ లే అవుట్ పూడిక పూర్తి చేసుకుని ఫ్లాట్‌లాగా విడగొట్టే సమయంలో అధికారులు నిర్లక్ష్యం వహించడం వల్ల ఫ్లాట్లకు సరిహద్దులు మారిపోయాయని, ఇటీవల కొందరు తహశీల్దార్ ఏడిద శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఆయన పట్టించుకోకపోవడంతో అధికారులు చెప్పిన చోట సరిహద్దురాళ్లను పాతుకోవడం లబ్ధిదారుల వంతైంది. నేడు రిజిస్ట్రేషన్ల కోసం గత మూడు రోజుల నుంచి సచివాలయాల చుట్టూ తిరుగుతున్నా హైస్కూల్ లే అవుట్ లబ్ధిదారులకు చుక్కెదురైంది. ఫ్లాట్ల సరిహద్దులు మారిపోయాయని, దీంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి కావట్లేదని అధికారులు చెప్పారు. దీంతో లబ్ధిదారులు ఆందోళనకు గురయ్యారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తామని, ఎవరూ ఆందోళన చెందొద్దని గ్రామ రెవెన్యూ అధికారి తెలిపారు. 96 మంది లబ్ధిదారులున్న లే అవుట్‌నే సక్రమంగా అందించలేని అధికారులపై శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. సిఎం జగన్ పేదవాడి సొంతింటి కలను నెరవేర్చేందుకు చూస్తుంటే అధికారులు నిర్లక్ష్యంగా ఆ కలకు తిలోదకాలిస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు.

మాంటిస్సోరిస్‌కు ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్

అవార్డులు అందుకుంటున్న కళాశాల యాజమాన్యం

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

మండలంలోని ఉల్లంపర్రు మాంటిస్సోరిస్ స్కూల్ ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌ను సొంతం చేసుకుంది. భారత ప్రభుత్వం వారు అందించే అత్యంత ప్రతిష్టాత్మకమైన ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌తో పాటు మరో మూడు సరికొత్త రికార్డ్స్‌ను సొంతం చేసుకుంది. భారదేశంలో అతిపెద్ద సైన్స్ ప్రదర్శనగా 632 ప్రాజెక్ట్స్‌తో, 650 మంది విద్యార్థులతో కిలోమీటర్ పొడవున ఏర్పాటు చేసిన ఈ సైన్స్ ప్రదర్శనకు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ దక్కించుకున్న ఉల్లంపర్రు మాంటిస్సోరిస్ స్కూల్ వారికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ అగ్రికల్చర్ శాస్త్రవేత్త డాక్టర్ కె.సరళ మాట్లాడుతూ ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో ఇప్పటివరకు 40 వేల మందికి చోటు దక్కిందని, కాని ఇటువంటి అరుదైన రికార్డ్‌ను సొంతం చేసుకున్నది మాత్రం ఉల్లంపర్రు మాంటిస్సోరిస్ స్కూల్ అని చెప్పారు. ఇక్కడ ప్రతిఒక్కరూ కూడా చాలా మంచి ప్రాజెక్టులను పెట్టారు. విద్యారులు పెట్టిన ప్రాజెక్టుల్లో ఫిజికల్ సైన్స్, బయాలజీ, సోషల్, మ్యాథమేటిక్స్ ప్రతిఒక్కరికీ ఉపయోగకరమైన పాఠ్యాంశాల్లోని విషయాల గురించి ఏర్పాటు చేయడమే కాకుండా అనర్గళంగా మాట్లాడుతున్నారన్నారు. ఈ రోజుల్లో మార్కులు, ర్యాంకులు సొసైటీలో చూపించుకోవడానికి మాత్రమే ఉపయోగపడతాయని, ఇటువంటి సైన్స్ ఫెయిర్‌లో పాల్గొనడం వల్ల విద్యార్థుల ప్రతిభను కనబర్చడానికి మంచి వేదిక అవుతుందని, పిల్లలకు ఇటువంటి విషయాలపై అవగాహన కల్పించాలని చెప్పారు. ఉల్లంపర్రు మాంటిస్సోరిస్ అధినేతలు అకాడమిక్ డైరెక్టర్ మద్దాల వాసు, సెక్రటరీ, కరస్పాండెంట్ మద్దాల రాంప్రసాద్, స్కూల్ ప్రిన్సిపల్ వసంతలక్ష్మిలకు అవార్డ్స్ అందించారు.

ఘనంగా కూచిపూడి జానపద నృత్య పోటీలు

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు క్షత్రియ సంక్షేమ పరిషత్, గౌరీశంకర్ సంగీత నృత్య కళా అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో క్షత్రియ కళ్యాణ మండపంలో ఉభయ తెలుగు రాష్ట్రాల కూచిపూడి, జానపద నృత్య పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. హైదరాబాద్, వైజాగ్, పొరుగు రాష్ట్రాల నుంచి కూడా ఈ పోటీల్లో పలువురు గత రాత్రి పాలకొల్లు విచ్చేశారు. పోటీల్లో పాల్గొనేవారికి క్షత్రియ సంక్షేమ పరిషత్ అధ్యక్షులు భూపతిరాజు విశ్వనాథరాజు, కన్వీనర్ ముత్యాల రామారావు, అయినాల సూర్య నారాయణమూర్తి దగ్గరుండి ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు. ఇంకా పోటీలు సజావుగా సాగేందుకు బొక్క నరసింహమూర్తి, డాక్టర్ కెఎస్‌పిఎన్.వర్మ వీరికి సహకరించారు.

కూచిపూడి నృత్యం చేస్తున్న బాలిక

నృత్య పోటీల్లో పాల్గొన్న బాలికలు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి - గణపవరం

మండల కేంద్రమైన గణపవరం జిల్లా పరిషత్ హైస్కూల్లో 1978-79 పూర్వ విద్యార్థులు ఆదివారరం సమ్మేళనమయ్యారు. అప్పటి విద్యార్థులు 55 మంది సమ్మేళనంలో పాల్గొన్నారు. 50 ఏళ్ల తర్వాత కలుసుకున్న వారందరూ ఆనాటి ముచ్చట్లు చెప్పకుని ఆనందించారు. తాము చదువుకున్న హైస్కూల్ అభివృద్ధికి రూ.50 వేలు అందించారు. ఈ కార్యక్రమంలో పి.సూర్యనారాయణ, కె.హరినాథ్, సప్పా గోవిందు పాల్గొన్నారు.

ఘనంగా యుటిఎఫ్ ప్రతిభా పరీక్ష

ప్రజాశక్తి - పోడూరు

యుటిఎఫ్ ప్రతిభా పరీక్ష మండల వ్యాప్తంగా ఆదివారం జరిగింది. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న ఐదు, పదో తరగతుల విద్యార్థులకు ఈ ప్రతిభా పాటవ పరీక్ష నిర్వహించారు. పదో తరగతి విద్యార్థులకు పోడూరు జెడ్పి హైస్కూల్లో నిర్వహించిన పరీక్షకు 151 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఐదో తరగతి విద్యార్థులకు గుమ్మలూరు, పోడూరు, జిన్నూరు, కవిటం పెనుమదం స్కూల్లో నిర్వహించిన పరీక్షకు 222 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పదో తరగతి తెలుగు మీడియం ప్రశ్నాపత్రాన్ని యుటిఎఫ్ సీనియర్ నాయకులు కె.చిరంజీవి విడుదల చేయగా, ఇంగ్లీష్ మీడియం ప్రశ్నాపత్రాన్ని వేడంగి హైస్కూల్ హెచ్ఎం జి.రామచంద్రరావు విడుదల చేశారు. ఈ పరీక్షల ఫలితాలు త్వరలో విడుదల చేసి బహుమతులు అందిస్తామని యుటిఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు డి.క్షేమమూర్తి, కె.నాగరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ ఎంవి.రాజశేఖర్, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు పి.శ్రీనివాస్, మండల గౌరవ అధ్యక్షులు బి.శేషగిరిరావు, సిహెచ్.త్రినాథ్, కె.పెద్దిరాజు, డి.శ్రీనివాస్, సిహెచ్.కరుణకుమారి, సిహెచ్.చిట్టిబుల్లెమ్మ పాల్గొన్నారు.

చంటికి సత్కారం

ప్రజాశక్తి - మొగల్తూరు

కల్లుగీత కార్మిక సంఘ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని ఆ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.చంటి అన్నారు. ఇటీవల తణుకులో కల్లు గీత కార్మిక సంఘం 15వ రాష్ట్ర మహాసభ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా వాకా రామచంద్రరావు, ప్రధాన కార్యదర్శిగా నరసింహమూర్తి, రాష్ట్ర సహాయ కార్యదర్శిగా మొగల్తూరుకు చెందిన బొక్క చంటిని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా మొగల్తూరులో ఆదివారం ఆ సంఘ నాయకులు చంటిని కలిసి అభినందించి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో గుబ్బల వెంకన్న, కాగితాల సత్యనారాయణ, బి.సత్యనారాయణ, దొంగ వెంకటేశ్వర్లు, కుక్కల వెంకటేశ్వర్లు, వాచర్ల శ్రీను, చింతపల్లి బాలకృష్ణ, సాయిబాబా, కడల సుబ్బారావు పాల్గొన్నారు.

'ఇంటింటికీ టిడిపితో కేడర్‌లో జోష్'

ప్రజాశక్తి - కాళ్ల

ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంతో పార్టీ కేడర్‌లో కొత్త జోష్ వచ్చిందని ఉండి ఎంఎల్ఎ మంతెన రామరాజు అన్నారు. మండలంలోని కోమట గుంటలో ఇంటింటికి టిడిపి బాబుతో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో టిడిపి, జనసేన కూటమి గెలిస్తేనే ప్రజలందరికీ మేలు జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ రామరాజు మాట్లాడుతూ గత ప్రభుత్వం హయాంలో కేటాయించిన నిధులను సైతం వైసిపి ప్రభుత్వం రద్దు చేయడంతో గ్రామాల అభివృద్ధికి ఆటంకం కలిగిందని విమర్శించారు. ప్రభుత్వం విద్య, వైద్యం, మౌలిక వసతులు విస్మరించి రాష్ట్ర అభివృద్ధిని అధోగతి పాల్జేస్తుందని విమర్శించారు.


మాట్లాడుతున్న మంతెన రామరాజు

టిడిపిలోకి పలువురు

రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో టిడిపి, జనసేన కూటమి విజయం సాధించడం ఖాయమని ఉండి ఎంఎల్ఎ మంతెన రామరాజు అన్నారు. కోమటిగుంటలో వైసిపి నాయకులు తెలుగుదేశం పార్టీలోకి చేరారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండలాధ్యక్షుడు జివి.నాగేశ్వరరావు, మాజీ సర్పంచి యలమంచిలి వెంకట రమణ, గ్రామ అధ్యక్షులు గుర్రం వెంకట సత్యనారాయణ, మండల ప్రధాన కార్యదర్శి మంతెన నాగాంజనేయులు, యలమంచిలి గణపతి, ఎంపిటిసి మాజీ సభ్యులు వేగశ్న రమేష్ రాజు, గులిపల్లి జోగయ్య పాల్గొన్నారు.

మహిళాభ్యున్నతికి అధిక ప్రాధాన్యత

ప్రజాశక్తి - ఆచంట

మహిళల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని ఆచంట ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. తూర్పుపాలెం క్యాంపు కార్యాలయంలో డ్వాక్రా మహిళల మనసారా ఆసరా సంబరాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి గూడూరి ఉమాబాల ముఖ్యఅతిథిగా హాజరై రంగనాథరాజును మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించారు. సుమారు 12 వేలమంది డ్వాక్రా మహిళలు కార్యక్రమంలో పాల్గొన్నారు. చిన్నారులకు పాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో శ్రీరంగనాథరాజు మాట్లాడుతూ రాష్ట్రంలోని మహిళల జీవన స్థితిగతులు మార్చేందుకు, వారి ఆరోగ్య సంరక్షణ, వారి పిల్లల విద్య కోసం సిఎం జగన్ ప్రవేశపెట్టిన పథకాలను వివరించారు. ప్రతి మహిళా తన తోబుట్టువులా భావించి వారికి భోజన సదుపాయంతోపాటు చీర, సారె పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా డ్వాక్రా మహిళలకు ఆసరా చెక్కును అందించారు. ఈ కార్యక్రమంలో ఆచంట నియోజకవర్గ పరిశీలకురాలు మేడపాటి షర్మిలారెడ్డి, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ ఛైర్మన్ గుబ్బల తమ్మయ్య పాల్గొన్నారు.

అన్నదాన భవన నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి - కాళ్ల

మండలంలోని కాళకూరులో స్వయంభూ శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో అన్నదాన భవన నిర్మాణానికి దాతలు రూ.లక్ష విరాళం అందించారు. ఆకివీడు గ్రామానికి చెందిన గుర్రం రాములు భార్య లక్ష్మీకాంతం, కోడలు లక్ష్మీకుమారి జ్ఞాపకార్థం గుర్రం లక్ష్మణరావు రూ:1,11,116 అన్నదాన భవన నిర్మాణానికి ఆలయ కార్యనిర్వహణాధికారి మోకా అరుణ్‌కుమార్‌కి అందించారు. ఈ సందర్భంగా దాతలను అభినందించారు.


విరాళం అందిస్తున్న దాతలు

నేరాలు - ఘోరాలు

కోడిపందేల స్థావరంపై దాడి

ప్రజాశక్తి - నరసాపురం

కోడిపందేల స్థావరంపై దాడి చేసిన పోలీసులు 23 మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి నగదు, కోడిపుంజులు, కోడికత్తులు, సెల్‌ఫోన్లు, కార్లు, బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. నరసాపురం రూరల్ సిఐ కె.గోవిందరాజు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని మల్లవరం లంక గ్రామంలో కోడిపందేలు నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు పోలీసులు ఆదివారం దాడి చేశారు. ఈ దాడిలో 23 మంది అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.4,89,460 నగదు, 26 కోడి పుంజులు, 57 కోడి కత్తులు, 31 సెల్‌ఫోన్లు, ఎనిమిది కార్లు, 30 బైక్‌లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కొణితివాడలో చోరీ

ప్రజాశక్తి - వీరవాసరం

వీరవాసరం పోలీస్‌స్టేషన్ పరిధి కొణితివాడ గ్రామంలో శనివారం రాత్రి ఒక ఇంట్లో దొంగలు పడి ఇంట్లోని బంగారం, వెండి, నగదు అపహరించుకుపోయారు. బంగారం, వెండి వస్తువుల విలువ సుమారు రూ.2.50 లక్షలు ఉంటుందన్నారు. నగదు రూ.1.87 లక్షలు ఉంటుదన్నారు. యరకరాజు రామసీత కుమార్తె లలిత అనారోగ్యంగా ఉండటంతో శనివారం రాత్రి భీమవరం ఆసుపత్రికి వెళ్లినట్లు బాధితురాలు తెలిపారు. భీమవరం సిఐ సంఘటనా ప్రాంతాన్ని పరిశీలించారు. రామసీతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్ఐ రమేష్ తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

సర్వర్ సమస్య.. ప్రజల అవస్థ

పిఎం విశ్వకర్మ యోజనకు దరఖాస్తు చేసుకునేందుకు ఇబ్బందులు

త్వరగా ఆన్‌లైన్ అవ్వని పరిస్థితి

సచివాలయంలో అందని ఉచిత సేవ

రూ.200 వసూలు చేస్తున్న ప్రయివేట్ నెట్ నిర్వాహకులు

ప్రజాశక్తి - నరసాపురం

నరేంద్రమోడీ తన పుట్టినరోజు సందర్భంగా ప్రారంభించిన పిఎం విశ్వకర్మ యోజన పథకానికి దరఖాస్తు చేసుకోవడానికి ప్రజలు నానా తంటాలు పడుతున్నారు. కుల వృత్తులు గలవారికి ఐదు నుంచి ఏడు రోజులు శిక్షణ, శిక్షణ సమయంలో రోజుకు రూ.500, అనంతరం రుణం, టూల్స్ కిట్ ఇస్తున్నారు. దీంతో జనం ఆసక్తి చూపుతున్నారు. ఇంటికి వచ్చి ఒక్క పేరే అర్హత అవుతుంది. గతేడాది ఆన్‌లైన్ చేసిన పేరులో అర్హులైన వారికి శిక్షణ పూర్తి కావడంతో కొత్తవారు దరఖాస్తు చేసేందుకు మొగ్గు చూపుతున్నారు. ఈ పథకానికి సచివాలయంలో ఆన్‌లైన్ చేయడంలేదని విమర్శలు వస్తున్నాయి. సచివాలయంలో ఈ సేవను ఉచితంగా చేస్తారు. ఎక్కువ సేపు సమయం కేటాయించలేని సిబ్బంది సచివాలయంలో ఆన్‌లైన్ చేయడం లేదని చెప్పేస్తున్నారు. దీంతో కొన్ని మీ సేవలు, ప్రయివేట్ నెట్ నిర్వాహకులు లబ్ధిదారులు వద్ద నుంచి ఆన్‌లైన్ చేసేందుకు రూ.150 నుంచి రూ.200 వరకూ వసూలు చేస్తున్నారు. ఇక్కడ ఇంత మాత్రమే వసూలు చేయాలని ధర లేకపోవడంతో ప్రయివేటు నెట్ నిర్వాహకులు రెచ్చిపోతున్నారు. లబ్ధిదారుల్లో ఎక్కువ మంది మహిళలు టైలర్ శిక్షణకు మొగ్గు చూపుతున్నారు. దీంతో నెట్ పాయింట్ల వద్ద పెద్ద ఎత్తున మహిళలు పడిగాపులు కాస్తున్నారు. సర్వర్ సమస్య తలెత్తడంతో నెట్ నిర్వాహకులు అదే అదునుగా చేసుకుని ఒక్కొక్క లబ్ధిదారుని నుంచి రూ.200 వరకు వసూలు చేస్తున్నారు. ప్రభుత్వం ఇటువంటి సేవలను ఉచితంగా నమోదు చేయాలని పలువురు కోరుతున్నారు. సర్వర్ సమస్య కారణంగా ఆన‌లైన్ వేగంగా అవ్వడంలేదు. లబ్ధిదారునికి ఓటీపీ రావడంతో పాటు బయోమెట్రిక్ కూడా వేయాల్సి ఉంది. రాత్రి సమయాల్లో మాత్రమే అవ్వడంతో పొద్దుపోయే వరకు చలికి కూడా తట్టుకుని ప్రజలు ఆన్‌లైన్ చేసుకుంటున్నారు.

మహిళలతో రద్దీగా ఉన్న మీ సేవ కేంద్రం

నేడు వికలాంగుల ధర్నా

ప్రజాశక్తి - భీమవరం

ఈ నెల ఐదో తేదీ సోమవారం కలెక్టరేట్ వద్ద జరిగే వికలాంగుల ధర్నా నిర్వహించనున్నట్లు వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా గౌరవ అధ్యక్షులు పివి.ప్రతాప్, జిల్లా కన్వీనర్ ఎం.వైకుంఠం, జిల్లా అధ్యక్షులు మద్దాల శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి నటరాజు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పింఛను రూ.ఆరు వేలకు పెంచాలని, బ్యాక్‌లాగ్ ఉద్యోగాల భర్తీ, బ్యాంకు రుణాలు మంజూరు చేయాలని కోరారు. ఇంటి స్థలం ఇచ్చి భవనం నిర్మించి ఇవ్వాలని, ఉద్యోగులకు ప్రమోషన్లో రిజర్వేషర్లు అమలు చేయాలని, వికలాంగుల హక్కుల చట్టం-2016 పూర్తి స్థాయిలో అమలు చేయాలని కోరారు. సోమవారం కలెక్టరేట్ వద్ద నిర్వహించనున్న ధర్నాలో జిల్లాలోని వికలాంగులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ఆకివీడు తహశీల్దార్‌గా వెంకటేశ్వరి

ప్రజాశక్తి - ఆకివీడు

ఆకివీడు తహశీల్దార్ ఎన్.విజయలక్ష్మి బదిలీ అయ్యారు. ఆమెను కృష్ణా జిల్లా ఘంటసాల నియమించారు. ఆ స్థానంలో కోనసీమ జిల్లా ఉప్పలగుప్తం మండల తహశీల్దార్ జవ్వారి వెంకటేశ్వరి ఆకివీడు బదిలీ అయ్యారు. ఆమె ఆదివారం సాయంత్రం బాధ్యతలు చేపట్టారు.

మొగల్తూరు ఎస్ఐగా వెంకటరమణ

ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరు ఎస్ఐగా కె.వెంకటరమణ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ ఎస్ఐగా పని చేసిన ఎం.వీరబాబు బదిలీపై స్పెషల్ బ్రాంచ్‌కి వెళ్లారు. వెంకటరమణ తూర్పుగోదావరి జిల్లా తాళ్లపూడి నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు.

నియోజకవర్గ అభివృద్ధికి ముదునూరి కృషి

ప్రజాశక్తి - నరసాపురం

నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసిన నాయకుడు చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అని రాష్ట్ర ప్రభుత్వ అగ్నికుల క్షత్రియ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ తిరుమాని నాగరాజు అన్నారు. మండలంలోని వేములదీవి వెస్ట్ గ్రామంలో తన స్వగృహంలో ఆదివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో పనిచేసిన ఏ ఎంఎల్ఎ అయినా నరసాపురం నియోజకవర్గ అభివృద్ధి గురించి పట్టించుకున్నారా అని ప్రశ్నించారు. గతంలో పని చేసిన ఎంఎల్ఎలు ఇప్పుడు మాట్లాడుతుంటే దెయ్యాలు వేదాలు వర్ణించినట్టు ఉందన్నారు. ఇప్పటివరకు ఏ ఎంఎల్ఎ చేయనటువంటి అభివృద్ధి చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు చేశారన్నారు. వ్యక్తిగత దూషణలు చేయడం సరికాదన్నారు. ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి కేంద్రం నుంచి ఈ నెల 3వ తేదీన అనుమతులు వచ్చాయని, తొమ్మిదో తేదీ నుంచి పనులు ప్రారంభిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు కర్రి ఏసుబాబు, తిరుమాని తాతరావు, తిరుమాని శ్రీను, కాంతారావు పాల్గొన్నారు.

సిపిఎంకు విరాళాలిచ్చి తోడ్పడండి

ప్రజాశక్తి - తణుకు రూరల్

ప్రజలు పక్షాన పోరాడుతున్న సిపిఎంకు విరాళాలు ఇవ్వాలని పట్టణ కార్యదర్శి పివి.ప్రతాప్ విజ్ఞప్తి చేశారు. స్థానిక ఇందిరమ్మ కాలనీలో ఆదివారం విరాళాల సేకరణ సిపిఎం ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రజల పక్షాన ఉద్యమాలు చేస్తున్న సిపిఎంకు ఆర్థికంగా సహాయం చేయాలని కోరారు. ఇందిరమ్మ కాలనీలో దోమల నివారణకు చర్యలు చేపట్టాలని, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని, పాడైన రోడ్లు వేయాలని, పైపులు కావాల్సిన చోట వేయాలని పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ 1964లో సిపిఎం ఏర్పడిన నాటి నుంచి నేటి వరకు ప్రజల పక్షాన పోరాడుతుందన్నారు. ఆశయ బలం తప్ప ఆర్థిక బలం లేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారంలోకొచ్చాక ప్రజా సమస్యలు పట్టించుకోవడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు అడ్డగర్ల అజయకుమారి, గార రంగారావు, గుబ్బల గోపీ, సాయిబాబా, సిహెచ్ఎస్.బాబు, అచ్చియ్య, పి.హర్షిత, వంశీకృష్ణ పాల్గొన్నారు.

'జనసేన విజయానికి కృషి చేయాలి'

ప్రజాశక్తి - మొగల్తూరు

విజయానికి ప్రతిఒక్కరూ శక్తి వంచన లేకుండా కృషి చేయాలని జనసేన పార్టీ నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొమ్మిడి నాయకర్ జనసేన సైనికులకు సూచించారు. మొగల్తూరులో జనసేన పార్టీ కార్యాలయాన్ని డాక్టర్ చినమిల్లి సత్యనారాయణ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న ఈ రెండు నెలలు కీలకమని, ప్రతిఒక్కరూ పార్టీ విజయానికి కృషి చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొల్లాటి గోపీ, బి.చంటి, నిప్పులేటి రామారావు, అందే దొరబాబు, కొండ, వేడిది బాబ్జి పాల్గొన్నారు.

పెరాలసిస్ బాధితుడికి వసుధ ఫౌండేషన్ సాయం

ప్రజాశక్తి - పాలకొల్లు

మండలంలోని చింతపర్రుకు చెందిన గన్నాబత్తుల నాగేశ్వరరావుకు పెరాలసిస్ వ్యాధి వచ్చి కాలు, చెయ్యి, మాట పడిపోయింది. ఆయనకు ముగ్గురు పిల్లలు ఉన్నారు. నిరుపేద కుటుంబ పరిస్థితిని వసుధ ఫౌండేషన్ ఛైర్మన్ మంతెన వెంకటరామరాజు దృష్టికి తీసుకెళ్లగా ఆయన వెంటనే స్పందించి రూ.20 వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ చెక్కును పాలకొల్లులో గ్రామ ఉప సర్పంచి రామకృష్ణ రాజు, వసుధ ఫౌండేషన్ కన్వీనర్ పి.బుద్ధరాజు, గ్రామ పెద్ద వేగేశ్న కృష్ణంరాజు, పెద్దిరెడ్డి శ్రీను, కత్తిముక్కల కనకారావు పాల్గొని అందించారు. వసుధ ఫౌండేషన్ ఛైర్మన్ మంతెన వెంకటరామరాజుకు కుటుంబ సభ్యులు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

ప్రజాశక్తి - కాళ్ల

కంటి, దంత సంరక్షణ పట్ల ప్రజలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కెవి.మురళీకృష్ణంరాజు అన్నారు. మండలంలోని పెదఅమిరంలో కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ఉచిత కంటి, దంత వైద్య శిబిరాలను ఆదివారం నిర్వహించారు. విష్ణు దంత వైద్య కళాశాల, భీమవరం మ్యాక్స్ విజన్ కంటి వైద్య నిపుణులు ఈ శిబిరంలో ప్రజలకు ఉచిత సేవలు అందించారు. ఈ సందర్భంగా విష్ణు డెంటల్ కళాశాల వైద్యనిపుణులు, చైతన్య మ్యాక్స్ విజన్‌కి చెందిన శ్రీహరి మాట్లాడుతూ ఉచిత సేవలకు తమ వంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచి డొక్కు సోమేశ్వరరావు మాట్లాడుతూ తమ గ్రామాన్ని ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఎంపిక చేసుకుని సేవా కార్యక్రమాలు అందించడం అభినందనీయమన్నారు. ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఆర్.కృష్ణచైతన్య మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ఎంతో ఆనందంగా వృద్ధులకు సేవలందిస్తున్నారు. ఇటువంటి శిబిరాలు విద్యార్థుల్లో సామాజిక సమస్యల పట్ల అవగాహన పెంపొందించేందుకు ఎంతగానో దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో యుబిఎ కో-ఆర్డినేటర్ డాక్టర్ మెహర్‌గణేష్, సహాయ ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ కెవి.సత్యనారాయణ, మాక్స్ విజన్ హెచ్ఆర్ పవన్ కుమార్ పాల్గొన్నారు.



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

అభివృద్ధి పేరుతో చీఫ్ విప్ ముదునూరి మోసం

మాజీ ఎంఎల్ఎ బండారు మాధవనాయుడు

ప్రజాశక్తి - నరసాపురం

సిఎం జగన్, ఎంఎల్ఎ ప్రసాదరాజు రూ.3,200 కోట్లతో చేసిన శంకుస్థాపన పనులన్నీ మోసమేనని మాజీ ఎంఎల్ఎ బండారు మాధవ నాయుడు అన్నారు. మండలంలోని వేములదివి గ్రామంలో బియ్యపు తిప్ప హార్బర్, నల్లి క్రీక్, అవుట్ ఫాల్ స్లూయిజ్ ప్రాంతాలను టిడిపి, జనసేన పార్టీ కుటుంబ సభ్యులతో కలిసి 50 కార్లతో నరసాపురం పట్టణం పుర వీధుల గుండా వేములదివి వరకు భారీ ర్యాలీగా వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా బండారు మాధవనాయుడు మాట్లాడుతూ అభివృద్ధి పేరుతో చీఫ్ విప్, ఎంఎల్ఎ ముదునూరి ప్రసాదరాజు ప్రజలను మోసం చేయడమే కాకుండా ఆయన ఆర్థిక లబ్ధి పొందుతున్నారన్నారు. హార్బర్ పేరుతో ప్రజలను మోసంచేసి హార్బర్ పరిసర ప్రాంతాల్లో బినామీ పేర్లతో 200 ఎకరాలు కొనుగోలు చేశారన్నారు. 2022 నవంబర్‌లో సిఎం జగన్ వచ్చి రూ.3,200 కోట్ల అభివృద్ధి పనులకు బటన్ నొక్కి 14 నెలలు గడుస్తుందన్నారు. టిడిపి హయాంలో అప్పటి సీఎం చంద్రబాబు నాయుడును కలిసి బియ్యపుతిప్ప హార్బర్‌కు ఫిష్ ల్యాండింగ్ సెంటర్ నిర్మాణానికి రూ.13.58 కోట్లు మంజూరు చేయించి అప్పటి పంచాయతీ రాజ్ శాఖ మంత్రి నారా లోకేష్‌తో శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. ఆ నిధులతో పనులు చేయిస్తే ఆయనకు లబ్ది ఉండదని, ప్రతిపక్షానికి పేరు వస్తుందని దుర్మార్గపు ఆలోచనతో పనులు నిలుపుదల చేశారన్నారు. హార్బర్ నిర్మాణ పేరుతో రూ.429.43 కోట్లతో శంకుస్థాపన చేశారే తప్ప ఏ పని మొదలు కాలేదన్నారు. బియ్యపుతిప్ప హార్బర్, నల్లి క్రీక్, కుక్కిలేరు డెడ్జింగ్ పనులు, బియ్యపుతిప్ప అవుట్ ఫాల్ స్లూయిజ్ పనులను వెంటనే మొదలు పెట్టాలని డిమాండ్ చేశారు. ప్రజలను మభ్య పెట్టి మోసం చేసే ఎంఎల్ఎ ప్రసాదరాజు వంటి వ్యక్తులకు ప్రజలు బుద్ధి చెప్పాలన్నారు.

దేవాంగులు అభ్యున్నతి సాధించాలి

జిల్లా దేవాంగ సంఘం నూతన కార్యవర్గం

ప్రజాశక్తి - పాలకొల్లు

దేవాంగులు సామాజికంగా, విద్య, ఆర్థిక, రాజకీయంగా ఎదిగినప్పుడే అభివృద్ధి సాధిస్తారని ఆ సంఘ జిల్లా అధ్యక్షులుగా ప్రమాణస్వీకారం చేసిన వి.గణేష్ చెప్పారు. పాలకొల్లు క్లాత్ మర్చంట్స్ సంఘ భవనంలో జిల్లా దేవాంగ సంఘం నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారంలో ఆయన మాట్లాడారు. దేవాంగులు రంగుల పనిలో ఎంతో నైపుణ్యం చూపించేవారన్నారు. జననేంద్రియాలు అన్ని పనిచేస్తేనే ఇతరుల మెప్పు పొందేవారని, అయితే ఆర్థికంగా ఎదగలేదని, అందుకే ప్రభుత్వ చేయూత అవసరమని అన్నారు. ఒకపక్క చేనేత కార్మికుల అభివృద్ధికి సహకరిస్తూనే, మరో పక్క మన పిల్లలు విద్యావంతులుగా రాణించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి ప్రతినిధులు సమావేశానికి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సంఘ అధ్యక్షులు పికె.నాగరాజు, ప్రధాన కార్యదర్శి పుచ్చల రామకృష్ణ, కోశాధికారి కనకరాజు, ఉమ్మడి జిల్లా అధ్యక్షులు యర్రా సోమలింగేశ్వరరావు, ఆవిర్భావ అధ్యక్షులు నక్కిన చిన వెంకటరాయుడు ప్రసంగించారు. జిల్లా అసోసియేటెడ్ అధ్యక్షులుగా మానెం బసవరాజు, ప్రధాన కార్యదర్శిగా హేమకుమార్, కోశాధికారిగా అల్లాడ కుమార్‌స్వామి ప్రమాణ స్వీకారం చేశారు. మహిళల విభాగం అధ్యక్షురాలుగా ఉప్పుగంటి రాజశ్రీ, ప్రధాన కార్యదర్శిగా కాకర్ల సుభద్ర, యువజన విభాగం అధ్యక్షులుగా మావూరి ఆనంద్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా కాకర్ల దుర్గాప్రసాద్, కోశాధికారిగా కామిశెట్టి జయరామ్ ప్రమాణస్వీకారం చేశారు.

ఎందరో ఉన్నతికి మార్గం సార్వత్రిక విద్యాపీఠం

రాష్ట్ర సమన్వయకర్త శివ కోటేశ్వరరావు

ప్రజాశక్తి - ఆకివీడు

చదువు మధ్యలో ఆపేసి కుటుంబ సంరక్షణకు ధనార్జనలో పడిన ఎందరో జీవితాల ఉన్నతికి సార్వత్రిక విద్యాపీఠం ఉపకరిస్తుందని విద్యాపీఠం (అపోస్) రాష్ట్ర సమన్వయకర్త జి.శివకోటేశ్వ రరావు అన్నారు. ప్రయివేటుగా పదో తరగతి, ఇంటర్ చదివే విద్యార్థుల కోసం విద్యాపీఠం నిర్వహిస్తున్న వారాంతపు తరగతులు ప్రతి ఆదివారం ఇక్కడ నిర్వహిస్తారు. ఈ తరగతులను ఆదివారం రాష్ట్ర కో-ఆర్డినేటర్ కోటేశ్వరరావు, స్థానిక ఎంఇఒ ఎ.రవీంద్ర పరిశీలించారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడారు. మధ్యతరగతి దిగుతరగతి వారు ఎందరో జీవితంలో చదువుకునేందుకు అవకాశం లేకపోవడంతో చదువులు అర్థంతరంగా ఆగిపోతున్నాయన్నారు. అటువంటి వారిని ప్రోత్సహించడమే ఈ కార్యక్రమం లక్ష్యమన్నారు. ఎంఇఒ రవీంద్ర మాట్లాడుతూ ఈ విధానంలో విద్యనభ్యసించి ఎంతో ఉన్నతకి ఎదిగినవారు అనేక మంది ఉన్నారన్నారు. చిరు ఉద్యోగులు ఎందరో తమ చదువును పెంచుకోవడం ద్వారా జీవితంలో ఎదగవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో అపోస్ కేంద్ర కన్వీనర్ (ప్రిన్సిపల్) సిహెచ్.బలరాంబాబు, జెడ్పి హైస్కూల్ ఫిజిక్స్ లెక్చరర్ ముత్యాల మెంకటస్వామి, లెక్చరర్లు గుడిపాటి వెంకటేశ్వరరావు, వాసు, వెంకట్, కళ్యాణి, రమేష్ పాల్గొన్నారు.

తరగతులను పరిశీలిస్తున్న కోటేశ్వరరావు, రవీంద్ర

'బిసిలు ఐకమత్యంతో టిడిపిని గెలిపించాలి'

ప్రజాశక్తి - భీమవరం రూరల్

బిసిలంతా ఐకమత్యంతో టిడిపి, జనసేన అభ్యర్థులను గెలిపించాలని, బిసిలకు న్యాయం చేసే ఏకైక పార్టీ టిడిపినేనని రాష్ట్ర నాయకులు మెంటే పార్థసారథి అన్నారు. టిడిపి జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి ఆదేశాల మేరకు శ్రీనివాస్ థియేటర్ సెంటర్‌లో కృష్ణ బలిజ సేవా సమితి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ, టిడిపి బిసి సాధికారిత కమిటీ డైరెక్టర్ గంటా త్రిమూర్తులు అధ్వర్యంలో ఆదివారం జయహో బిసి, బిసి పోరుబాట, బిసి సాధికారిత కమిటీ రాష్ట్ర సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పార్థసారథి మాట్లాడుతూ రాజధాని లేని రాష్ట్రం మన ఆంధ్రప్రదేశేనన్నారు. ఐదేళ్లలో రాజధానే లేకుండా జగన్ పరిపాలన సాగించారన్నారు. బిసిలతోపాటు అన్ని వర్గాల ప్రజలను సిఎం జగన్ మోసం చేస్తున్నారని విమర్శించారు. టిడిపి బిసి సాధికారిత కమిటీ డైరెక్టర్ గంటా త్రిమూర్తులు మాట్లాడుతూ జగన్ గర్వంతో ఉన్నాడే తప్ప అభివృద్ధి అనేది లేదన్నారు. ఏ వర్గానికి సమన్యాయం చేయడం లేదని, పేద ప్రజలు అన్ని విధాలుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. టిడిపి ప్రభుత్వం రాగానే అందరికీ న్యాయం చేస్తామన్నారు. వైసిపి ప్రభుత్వానికి కౌంట్ డౌన్ మొదలైందని, రానున్నది టిడిపి, జనసేన ప్రభుత్వమేనన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి, నాయకులు గంటా నాగలక్ష్మి, టిడిపి కృష్ణ బలిజ సాధికారిత కమిటీ రాష్ట్ర కన్వీనర్ కావేటి వేణు, డైరెక్టర్ సిహెచ్.ప్రసాద్, జగదీష్, వి.నాగేశ్వరరావు, పసుపులేటి శ్రీనివాస్, నన్నుబోలు రాధాకృష్ణ, నన్నుబోలు మణికంఠ, టిడిపి సీనియర్ నాయకులు మద్దుల రాము, మైలాబత్తుల ఐజాక్‌బాబు పాల్గొన్నారు.

విప్ గ్రంధిని కలిసిన ఎంపీ అభ్యర్థి ఉమాబాల

ప్రజాశక్తి - భీమవరం రూరల్

వైసిపి నరసాపురం పార్లమెంట్ అభ్యర్థి గూడూరి ఉమాబాల ఆమె భర్త జగదీష్‌తో కలిసి ఆదివారం ప్రభుత్వ విప్ ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్‌ను మర్యాదపరంగా కలిశారు. గ్రంధికి పుష్పగుచ్ఛం అందించారు.ఎంపీ అభ్యర్థిగా ప్రకటించడానికి కృషి చేసిన గ్రంధికి వారు ధన్యవాదాలు తెలిపారు.

జువ్వలపాలెంలో మెగా ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - కాళ్ల

మండలంలోని జువ్వలపాలెంలో గోకరాజు వినోద రంగరాజు (బాబు) ఆధ్వర్యంలో జెపి క్లినికల్ లేబోరేటరీ 1వ వార్షికోత్సవం సందర్భంగా మెగా ఉచిత మెడికల్ క్యాంపు ఆదివారం నిర్వహించారు. బిఎండి (బోన్ స్కాన్) ఎముకల పట్టుత్వ పరీక్ష, బిపి, షుగర్, కిడ్నీ, ఇసిజి వైద్య పరీక్షలు ఉచితంగా చేశారు. మిగతా పరీక్షలకు 30 శాతం రాయితీ ఇచ్చినట్లు చెప్పారు. ఈ మెగా ఉచిత వైద్య శిబిరంలో వైద్య నిపుణులు రవీంద్ర, హరీష్, జి.వంశీకృష్ణ సేవలందించారు. కిరణ్ కంటి ఆసుపత్రివారు అన్ని రకాల కంటి పరీక్షలు, విష్ణు డెంటల్ హాస్పిటల్ వారు అన్ని రకాల దంత పరీక్షలు చేశారు. 450 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ క్యాంపులో బైర్రాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా మందులు అందించారు.

పెనుగొండలో 'ప్రజల వద్దకు పితాని'

ప్రజాశక్తి - పెనుగొండ

మండల కేంద్రమైన పెనుగొండలో ఆదివారం నాలుగో రోజు ప్రజల వద్దకు పితాని కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి పితాని సత్యనారాయణ గ్రామంలోని గుబ్బలవారివీధి, మసీదు వీధి, సుబ్బారావు ఆలయం వద్ద ఇంటింటికీ వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. టిడిపి, జనసేన ఉమ్మడి అభ్యర్థికి ఓటేసి ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచి శ్యామల సోని, టిడిపి, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

నరసాపురంలో అన్నదానం

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం ఆరో వార్డులో ఉన్న గంట్లమ్మ ఆలయం వద్ద ఆదివారం అఖండ అన్నసమారాధన నిర్వహించారు. గంటమ్మ జాతర ఉత్సవాలు ముగించుకుని ఆలయ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భక్తుల సహకారంతో ఈ సమారాధన నిర్వహించారు. యాత్రికులు అధిక సంఖ్యలో పాల్గొని అన్న ప్రసాదాలు స్వీకరించారు.

మత్స్యకారులకు అండగా చీఫ్ విప్ ప్రసాదరాజు

ప్రజాశక్తి - నరసాపురం

మత్స్యకారులకు చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు ఎప్పుడూ అండగా ఉన్నారని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా మత్స్య సహకార సంఘాల అధ్యక్షులు, మాజీ ఆప్కాబ్ ఛైర్మన్ అంగ్రాజు చల్లారావు, రాష్ట్ర కార్యదర్శి బర్రి శంకర్ అన్నారు. ఆదివారం సాయంత్రం పట్టణంలోని చీఫ్ విఫ్ కార్యాలయంలో పాత్రికేయులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిఎం జగన్ పరిపాలనలో రాష్ట్ర మత్స్యకారులంతా సంతోషంగా ఉన్నారన్నారు. రాష్ట్రంలో ఉన్న మత్స్యకారులందరినీ ఆర్థికంగా ఆదుకున్నది ఒక్క జగన్మోహన్ రెడ్డి అన్నారు. నాడు, నేడు నరసాపురం నియోజకవర్గాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేసింది, చేస్తున్నది ముదునూరి ప్రసాదరాజు అన్నారు. వ్యక్తిగత ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ప్రసాదరాజు నిబద్ధత వల్లే బస్టాండ్, గవర్నమెంట్ హాస్పిటల్, కాటన్ పార్క్, రహదారులు, డ్రింకింగ్ వాటర్ ప్రాజెక్ట్ వంటి అభివృద్ధి జరిగిందన్నారు. వశిష్ట వారధి నిర్మాణాన్ని తరచూ కోర్టులో వేసి అడ్డుకుంటున్నారన్నారు.

పంట నమోదు చేసుకోండి

వీరవాసరం :సాగు చేసే ప్రతి రైతు ఈ పంట నమోదు చేయించుకోవాలని భీమవరం ఎడిఎ చింత శ్రీనివాసరావు రైతులకు సూచించారు. ఈ మేరకు ఆదివారం ఆయన మండలంలో పర్యటించారు. వీరవాసరం మండలంలో 70 శాతం నాట్లు పూర్తయినట్లు మండల వ్యవసాయాధికారిణి బిన్నీబాబు తెలిపారు. 2023-24కు సబంధించి 11600 ఎకరాలు సాగు చేస్తుండగా ఇప్పటి వరకు 6100 వరకు ఇ పంట నమోదు పూర్తయిందన్నారు. ఈ పంట నమోదు చేసుకున్న ప్రతి రైతు ఇ కెవైసి చేయించుకోవాలన్నారు. రైతులకు అవసరమైన ఎరువులను ఆర్‌బికెల్లో సిద్ధంగా ఉన్నాయన్నారు. ఎంటియు 1121 80 శాతం, ఎంటియు 1153 20 శాతం సాగు చేసినట్లు తెలిపారు.

దస్తావేజు పోయినది

ఏలూరు జిల్లా, ఆగిరిపల్లి మండలం, ఆగిరిపల్లి గ్రామ వాస్తవ్యులు పొన్నూరు (లేటు) వెంకటాచార్యులు గారి కుమారుడు పొన్నూరు లక్ష్మీ శివ సాంబశివరావు పేరన ఆగిరిపల్లి మండలం, ఆగిరిపల్లిలోని సాయిదుర్గా-2 నందు గల వెంచర్‌లో ప్లాట్ నెం. 72 నందు ఆర్.యస్. నెం. 5రు దాఖలా చ॥గ॥ 200.22లు నివేశన స్థలమునకు సంబంధించిన **ఒరిజినల్ దస్తావేజు (నెం. 2846/2012)** పోయినది. ఆచూకీ తెలిసిన వారు ఈక్రింది అడ్రస్‌కు తెలియపర్చగలరు.

పొన్నూరు లక్ష్మీ శివ సాంబశివరావు
(తండ్రి) వెంకటాచార్యులు (లేటు)
ఆగిరిపల్లి గ్రామం, ఆగిరిపల్లి మండలం

దస్తావేజు పోయినది

ఏలూరు జిల్లా, ఆగిరిపల్లి మండలం, కొమ్మూరు గ్రామ వాస్తవ్యులు అనంతనేని రామచంద్రరావు గారి భార్య అనంతనేని శకుంతల పేరన ఆగిరిపల్లి మండలం, సూరవరం రెవిన్యూ గ్రామంలోని ఆర్.యస్. నెం. 120/4రు దాఖలా య. 0.72 ట్లు మరియు ఆర్.యస్. నెం. 120/5 రు దాఖలా య. 1.46 ట్లు వెరశి య. 2.18 టుల వ్యవసాయ భూమికి సంబంధించిన **ఒరిజినల్ దస్తావేజు (నెం. 2486/1995)** పోయినది. ఆచూకీ తెలిసిన వారు ఈక్రింది అడ్రస్‌కు తెలియపర్చగలరు.

అనంతనేని శకుంతల
(భర్త) రామచంద్రరావు
కొమ్మూరు గ్రామం, ఆగిరిపల్లి మండలం